


మాదాపూర్ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి వి.జగదీశ్వర్‌గౌడ్



అన్ని వర్గాల ప్రజలకు అండగా కాంగ్రెస్



పాపిరెడ్డి కాలనీలో..



మాదాపూర్: కాంగ్రెస్ అన్ని వర్గాల ప్రజలకు అండగా ఉంటుందని పార్టీ శేరిలింగంపల్లి అభ్యర్థి వి.జగదీశ్వర్‌గౌడ్ పేర్కొన్నారు. సోమవారం మాదాపూర్ డివిజన్ పరిధిలో పలు కాలనీలలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ గెలుపు ఖాయమన్నారు. మాదాపూర్‌లోని ఖానామెట్, చందానాయక్‌తండా, ధోబీఘాట్, వడ్డెరబస్తీ, అమర్‌సొసైటీ ప్రాంతాలలో ప్రచారం చేశారు. కాంగ్రెస్ సంక్షేమ పథకాలు ఇందిరమ్మ ఇల్లు, మహాలక్ష్మి పథకం, రైతు భరోసా, గృహలక్ష్మి, యువవికాసం, వృద్ధులకు, వికలాంగులకు చేయూత పథకాలను ప్రతి ఒక్కరికి అందించనున్నట్టు తెలిపారు. మాదాపూర్‌లోని దోబీఘాట్‌లో వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మాదాపూర్ డివిజన్ అధ్యక్షుడు సురేష్‌నాయక్, నాయకులు నాగేశ్‌నాయక్, గౌస్, రామకృష్ణ, వెంకటస్వామి, పాల్గొన్నారు.

దీప్తి శ్రీనగర్‌లో సమావేశం

మియాపూర్ : ప్రజాస్వామ్యం కావాలంటే కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని పార్టీ నాయకులు తుమ్మల నాగేశ్వర్‌రావు పేర్కొన్నారు. మియాపూర్‌లోని దీప్తి శ్రీనగర్ కాలనీలో కాంగ్రెస్, టీడీపీ నాయకులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆత్మగౌరవంతో ఉండాల్సిన తెలంగాణ గడ్డ ఒడిదుడుకులకు లోనవుతుందన్నారు. అభ్యర్థి జగదీశ్వర్‌గౌడ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. 2 సీట్లు గెలుచుకుంటుందన్నారు.

6 గ్యారంటీలపై రోడ్ షో..బైకుల ర్యాలీ

హఫీజ్‌పేట్ : కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కాలనీ, బస్తీలలో రోడ్ షో...బైక్ ర్యాలీని సోమవారం శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వి.జగదీశ్వర్‌గౌడ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అధిష్ఠానం తెలంగాణ రాష్ట్రం ఇచ్చారని, ఇప్పుడు అన్ని వర్గాల ప్రజల కోసం 6 గ్యారంటీలను తీసుకురావడం జరిగిందన్నారు. శేరిలింగంపల్లి గడ్డపై కాంగ్రెస్ జెండా రెపరెపలాడే రోజు వచ్చేసిందన్నారు.



శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని పాపిరెడ్డి కాలనీలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వి.జగదీశ్వర్ గౌడ్ నిర్వహించిన రోడ్ షోకు హాజరైన జనసందోహం

క్రమశిక్షణతో విజయం సాధ్యం



స్నాతకోత్సవంలో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సురెపల్లి నంద తదితరులు

మాదాపూర్: క్రమశిక్షణతో ఎన్ని సవాళ్ళనైనా ఎదుర్కొని విజయం సాధించవచ్చని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సురెపల్లి నంద పేర్కొన్నారు. మాదాపూర్‌లోని శిల్పకళావేదికలో సోమవారం అవినాష్ విద్యాసంస్థల స్నాతకోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన జస్టిస్ సురెపల్లి నంద మాట్లాడుతూ కలలను సాకారం చేసుకునే ప్రయత్నంలో సవాళ్ళను ఎదుర్కోవడానికి విద్యార్థులు ఎల్లప్పుడు సంసిద్ధంగా ఉండాలని తెలిపారు. విద్యార్థులను తీర్చిదిద్దడంలో అధ్యాపకుల పాత్ర గొప్పదని కొనియాడారు. ప్రథమ స్థానంలో నిలిచిన వారికి బంగారు పతకాలను, ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఉస్మానియా యూనివర్శిటీ రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీ నారాయణ, అవినాష్ విద్యాసంస్థల వ్యవస్థాపకుడు డాక్టర్ అవినాష్ బ్రహ్మదేవర, ప్రిన్సిపల్స్, అధ్యాపకులు పాల్గొన్నారు.

మూగజీవాలపై దయ చూపాలి

గచ్చిబౌలి: మూగ జీవాల పట్ల కరుణ చూపాలని యునైటెడ్ వెజిటేరియన్ ఫోరం వ్యవస్థాపక అధ్యక్షురాలు విజయలక్ష్మీ పిలుపునిచ్చారు. కార్తీక మాసాన్ని పురస్కరించుకొని ఫోరం అధ్వర్యంలో దివ్యశ్రీ శక్తి అపార్ట్‌మెంట్‌లో పాత్రలు, పేపర్లు, బట్టలు సేకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శాఖాహారం ప్రాముఖ్యత, సర్వ ప్రాణుల పట్ల దయ గురించి వివరించారు. గాయపడ్డ మూగ జీవాల వినియోగార్థం బీరంగూడలోని యానిమల్ వారియర్స్ కన్జర్వేషన్ సొసైటీకి అప్పగించారు. సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షులు ప్రదీప్ నాయర్, సంతోష్, రెస్క్యూ ఆపరేషన్ విద్యార్థులు నవీన్, వేదాంత్, వర్ధన్, సహర్ష్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఐసీసీలో పురుషుల దినోత్సవం



అవార్డులు అందజేసిన సంగీతారెడ్డి



మాదాపూర్: మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో అపోలో క్యాన్సర్ సెంటర్స్, క్యూర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పురుషుల దినోత్సవాన్ని ఆదివారం రాత్రి నిర్వహించారు. క్యాన్సర్‌ను జయించిన చిన్నారులు, ప్రముఖుల క్యాట్‌వాక్‌లు సందర్శకులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అపోలో జాయింట్ ఎండి సంగీతారెడ్డి హాజరయ్యారు. సమాజాన్ని ప్రభావితం చేసిన వారికి అచీవర్స్ అనంత్ ఇంటర్నేషనల్ మెన్స్ అవార్డులను అందజేశారు. కార్యక్రమంలో సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి సుభాష్‌రెడ్డి, రెడ్డీస్ ల్యాబొరేటరీస్ కో చైర్మన్ ప్రసాద్ జీవీ రెడ్డి, ఏఐజీ ఆసుపత్రి చైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి, హైదరాబాద్ మాజీ పోలీసు కమిషనర్ సివి. ఆనంద్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన ఫ్యాషన్‌షో ఆకట్టుకుంది.

ఘనంగా సాధన పాఠశాల వార్షికోత్సవం

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లిలోని సాధన ఇన్ఫినిటీ ఇంటర్నేషనల్ పాఠశాల ఆరవ వార్షికోత్సవ వేడుకలు సోమవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. 'పనాష్-దహెరాల్డ్ ఆఫ్ హోప్' పేరుతో నిర్వహించిన ఈ వేడుకలను విశ్రాంత ఐఏఎస్ అధికారి చిత్రారామచంద్రన్ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మంచి పాఠశాలలు మంచి విద్యార్థులను తయారుచేస్తాయన్నారు. విద్యారంగానికి సేవ చేస్తున్నందుకు సాధన సూరపనేనిని ఆమె అభినందించారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను, క్రీడావిజేతలకు ప్రశంసాపత్రాలను అందించారు. అనంతరం పండోరబాక్స్ సామాజిక సవాళ్ళను మానవ ఆత్మ యొక్క స్థితిస్థాపకతను అన్వేషించే ఆకర్షణీయమైన కథనాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీబీఎస్ఈ పాఠశాల ప్రిన్సిపల్ ప్రమీలా దుగ్గినేని, డైరెక్టర్ ఆపరేషన్స్ మురళీమోహన్, వైస్‌ప్రిన్సిపల్ మాధవిలత, అకడమిక్ హెడ్‌శిరీష, సీనియర్ హెచ్‌ఎం వందన, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అభ్యర్థి ఆరెకపూడి గాంధీ

హ్యాట్రిక్ విజయం సాధిస్తాం

శేరిలింగంపల్లి/రాయదుర్గం : శేరిలింగంపల్లిలో హ్యాట్రిక్ విజయం సాధిస్తామని ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి ఆరెకపూడి గాంధీ స్పష్టం చేశారు. రాయదుర్గంలోని వీకర్‌సెక్షన్ కాలనీ, ముస్లిం బస్తీవాసులతో సోమవారం మాజీ కార్పొరేటర్ సాయిబాబాతో కలిసి సమావేశమై వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన తర్వాత మరిన్ని పథకాలు పెంచుతామన్నారు.

విజయాన్ని ఆపలేరు

శేరిలింగంపల్లిలో బీఆర్ఎస్ విజయాన్ని ఎవరూ ఆపలేరని గచ్చిబౌలి మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా పేర్కొన్నారు.గచ్చిబౌలి డివిజన్‌లోని నల్లగండ్లలో ఓటర్లను కలిసి కరపత్రాలను అందించి కారు గుర్తుకు ఓటు వేసి గాంధీని మరోసారి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు గణేష్‌ముదిరాజ్, చెన్నంరాజు, జంగయ్యయాదవ్, రాజునాయక్, యాదగిరితోపాటు పలువురు పాల్గొన్నారు.

వెస్ట్రన్ ప్లాజావాసులతో మాజీ కార్పొరేటర్ సమావేశం

గచ్చిబౌలి డివిజన్‌లోని రాయదుర్గం వెస్ట్రన్ ప్లాజావాసులతో బీఆర్ఎస్ నాయకులు సమావేశమయ్యారు. ముఖ్యంగా ఈ ఎన్నికలలో బీఆర్ఎస్ పార్టీని మరోసారి గెలిపించాలని కోరుతూ సాయిబాబా, సీనియర్ నాయకుడు గణేష్ ముదిరాజ్‌తోపాటు పలువురు నాయకులు కాలనీ అసోసియేషన్ సభ్యులతో సమావేశమయ్యారు. అందరూ ఓటు హక్కును వినియోగించుకొనేలా చూడాలని కోరారు.

కేశవనగర్‌వాసుల చేరిక...

గచ్చిబౌలి డివిజన్‌లోని కేశవనగర్‌కు చెందిన 100 మంది బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి కొమిరిశెట్టి సాయిబాబా పార్టీ కండువాలను కప్పి ఆహ్వానించారు. ఈ ఎన్నికలలో బీఆర్ఎస్ పార్టీ ఘన విజయం సాధించడంపై అందరూ దృష్టి పెట్టాలని సూచించారు.



రాయదుర్గంలో వీకర్‌సెక్షన్ కాలనీ ముస్లింలతో మాట్లాడుతున్న గాంధీ

గ్రేటర్ ఎరుకల సంఘం మద్దతు

అల్విన్‌కాలనీ: ఎరుకల సమాజం సమస్యలు పూర్తి స్థాయిలో పరిష్కరిస్తానని అరెకపూడి గాంధీ అన్నారు. శేరిలింగంపల్లి బీఆర్‌యస్ అభ్యర్థి గాంధీకి తెలంగాణ ఎరుకల సంఘం గ్రేటర్ హైదరాబాద్ కమిటి, శేరిలింగంపల్లి నియోజవర్గ ఎరుకల సంఘం నాయకులు తమ పూర్తి మద్దతు తెలిపారు. సోమవారం బీఆర్‌యస్ అభ్యర్థి గాంధీని కలిసి ఏకగ్రీవ తీర్మాన పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఎరుకల సంఘం గ్రేటర్ హైదరాబాద్ కమిటి అధ్యక్షుడు రస్థాపురం సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి బిజిలి ఎల్లేష్, కమిటి సభ్యులు ఎరుకల ఆత్మ గౌరవ సభను సోమవారం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా అరెకపూడి గాంధీ, గౌరవ సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే కుర్ర సత్యనారాయణ, రాష్ట్ర అధ్యక్షుడు కూతాడి రాములు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజు హాజరయ్యారు.

బీఆర్ఎస్ కార్యాలయం ప్రారంభం

శేరిలింగంపల్లి: డివిజన్‌లోని తారానగర్‌లో శేరిలింగంపల్లి బీఆర్ఎస్ ఇన్‌చార్జీ చంద్రశేఖర్ రెడ్డి, కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్‌తో కలిసి పార్టీ ఎన్నికల కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అభివృద్ధిని చూసి మరోసారి అవకాశం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రాజుయాదవ్, వీరేశంగౌడ్, హబీబ్, మహ్మద్ మజార్, ఇంతియాజ్, సయ్యద్ మీర్ అలీ, ఆహ్మద్, రాంచందర్ పాల్గొన్నారు.

రేవంత్ రెడ్డి .. నీ కబ్జా భాగోతాన్ని నిరూపిస్తా

గచ్చిబౌలి: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి గోపన్‌పల్లి సర్వే నంబర్ 127లో చేసిన కబ్జా బాగోతం అందరికి తెలుసని, ఏ వేదిక మీదైనా నిరూపించేందుకు సిద్ధంగా ఉన్నానని బీఆర్ఎస్ ఎమ్మెల్యే శేరిలింగంపల్లి అభ్యర్థి ఆరెకపూడి గాంధీ ఘాటుగా విమర్శించారు. శేరిలింగంపల్లి రోడ్ షోలో రేవంత్ రెడ్డి తనపై చేసిన వ్యాఖ్యలను గాంధీ ఖండించారు. తెలుగుదేశం పార్టీని సర్వ నాశనం చేసింది రేవంత్ రెడ్డి కాదా? అని ప్రశ్నించారు. నాలుగు పార్టీలు మారిన వ్యక్తికి తనను విమర్శించే అర్హత లేదన్నారు. ఎక్కడ కబ్జా చేశానో నిరూపిస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటానని గాంధీ సవాల్ విసిరారు. తప్పుడు ఆరోపణలు చేస్తే సహించేది లేదని గాంధీ హెచ్చరించారు.

ఆత్మీయ సమావేశాలు

హఫీజ్‌పేట్ : మాదాపూర్ డివిజన్ పరిధిలోని గోకుల్ ప్లాట్స్‌లోని ప్రజయ్ అపార్ట్‌మెంట్స్, మహేంద్ర అశ్విత అపార్ట్‌మెంట్స్, శిల్ప పార్కు కాలనీలలో బీఆర్ఎస్ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కాలనీవాసులు బీఆర్ఎస్‌కు మద్దతు తెలిపారు.

హఫీజ్‌పేట్ డివిజన్‌లో..

మైహోమ్ జువెల్, సాయిరాం టవర్స్, భాను టౌన్‌షిప్‌లలో ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ మాట్లాడుతూ నియోజకవర్గంను మరింత అభివృద్ధి చేయాలంటే కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్ పార్టీని గెలిపించాలన్నారు. 9 సంవత్సరాలలో రూ.9వేల కోట్లతో వివిధ రకాలుగా అభివృద్ధి చేశామన్నారు.

అఖండ మెజార్టీతో గెలిపించుకుంటాం...

కొండాపూర్ డివిజన్ పరిధిలోని జాగృతి కాలనీ, రసస్ అపార్ట్‌మెంట్స్‌వాసులతో మాజీ కార్పొరేటర్ రవీందర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఆత్మీయ సమావేశానికి ఎమ్మెల్యే గాంధీ హాజరై మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా అపార్టుమెంట్‌వాసులు మద్దతు తెలిపారు.



హఫీజ్‌పేట్‌లో గాంధీని ఆశీర్వదిస్తున్న వృద్ధురాలు



ఎరుకల ఆత్మ గౌరవసభలో గాంధీ, సంఘం నాయకులు



రవికుమార్‌యాదవ్, కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డిలకు గజమాలను వేస్తున్న దృశ్యం

చేవెళ్ళ మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ధీమా

భారీ మెజార్టీతో గెలవడం ఖాయం



గచ్చిబౌలి ప్రధాన రోడ్డుపై బీజేపీ బైక్ ర్యాలీ



రాయదుర్గంలో .. మాట్లాడుతున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, చిత్రంలో అభ్యర్థి రవికుమార్‌యాదవ్, కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

రాయదుర్గం/శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లిలో భారీ మెజార్టీతో బీజేపీ గెలవడం ఖాయమని చేవెళ్ళ మాజీ పార్లమెంటు సభ్యుడు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. రాయదుర్గంలో బీజేపీ ఆధ్వర్యంలో భారీ బైక్‌ర్యాలీని ఆయన అభ్యర్థి రవికుమార్ యాదవ్, కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డితో కలిసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడికి వెళ్ళినా ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందని, యువత, మహిళలు పెద్ద ఎత్తున బీజేపీని ఆదరిస్తున్నారన్నారు. బీజేపీ అభ్యర్థి రవికుమార్‌యాదవ్ మాట్లాడుతూ శేరిలింగంపల్లి అభివృద్ధికి కట్టుబడి ఉన్నామన్నారు.

గచ్చిబౌలిలో భారీ బైక్‌ర్యాలీ..

బీజేపీ ఆధ్వర్యంలో గచ్చిబౌలి డివిజన్‌లో సోమవారం భారీ బైక్ ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీని రాయదుర్గంలో మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, బీజేపీఅభ్యర్థి రవికుమార్‌యాదవ్, కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం రాయదుర్గం, మధురానగర్, ఖాజాగూడ, నానక్‌రాంగూడ, గౌలిదొడ్డి, గోపన్‌పల్లి తండా, గోపన్‌పల్లి, శ్రీకృష్ణకాలనీ, నల్లగండ్ల, గుల్‌మొహర్ పార్కుకాలనీ, హెచ్‌సీయూ, గచ్చిబౌలి కూడలి, వినాయక్‌నగర్, టెలికామ్‌నగర్ వరకు భారీ ర్యాలీని నిర్వహించారు.

భారీ గజమాలతో సత్కారం

బీజేపీ అభ్యర్థి రవికుమార్‌యాదవ్, గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డిని కార్యకర్తలు భారీ గజమాలతో సత్కరించారు.

గిరిజన సాంప్రదాయంతో స్వాగతం

గోపన్‌పల్లితండాలో బైక్‌ర్యాలీతో వచ్చిన బీజేపీ అభ్యర్థి రవికుమార్‌యాదవ్, గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డికి గిరిజన మహిళలు సాంప్రదాయ దుస్తులు ధరించి ఘన స్వాగతం పలికారు. అనంతరం గిరిజన మహిళలు సాంప్రదాయ పాటలతో వారిని ఆశీర్వదించారు.

ఆ పార్టీలు ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తున్నాయి

అల్విన్‌కాలనీ: బీఆర్‌యస్, కాంగ్రెస్ పార్టీలు ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తున్నారని మాజీ శాసనసభ్యుడు ఎం. భిక్షపతి యాదవ్ పేర్కొన్నారు. సోమవారం నియోజకవర్గం పరిధిలోని ఆల్విన్ కాలనీ ఫేజ్ 1లో బీజేపీ సీనియర్ నాయకులు రాయల్, వెంకటస్వామిరెడ్డి, యాదవరెడ్డిల నివాసాలకు వెళ్లి వారి మద్దతు కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి రవికుమార్ యాదవ్‌ని భారీ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే బీజేపీ ద్వారా మాత్రమే సాధ్యమవుతుందన్నారు. కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి రవికుమార్‌ను మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.



గోపన్‌పల్లి తండాలో రవికుమార్‌యాదవ్, కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డికి గిరిజన మహిళల సాంప్రదాయ స్వాగతం



రాయదుర్గం.. బైక్‌ర్యాలీలో ప్రజలకు అభివాదం చేస్తున్న, పార్టీ అభ్యర్థి రవికుమార్‌యాదవ్

ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ యాప్ 'సబ్‌కా వికాస్'

రూపకర్త విద్యార్థి రిషబ్‌ను కలిసిన కేంద్ర మంత్రి రాజీవ్ చంద్రశేఖర్



రిషబ్‌తో మాట్లాడుతున్న కేంద్రమంత్రి రాజీవ్ చంద్రశేఖర్

రాయదుర్గం: ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అప్లికేషన్ యాప్ 'సబ్‌కా వికాస్'ను నగర శివారుకు చెందిన విద్యార్థి రిషబ్ రూపొందించారు. తొమ్మిది భాషల్లో కేంద్ర, రాష్ట్ర స్థాయి పథకాలకు సంబంధించిన సమాచారాన్ని అక్షరాస్య, నిరక్ష్యరాస్య ప్రజలకు అర్థమయ్యే విధంగా దీన్ని రూపొందించడం విశేషం. గౌలిదొడ్డిలోని ఓ గేటెడ్ కమ్యూనిటీలో ఉండే రాక్‌వెల్ ఇంటర్నేషనల్ స్కూల్ 12వ తరగతి విద్యార్థి రిషబ్‌ను కేంద్ర నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపక సహాయ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ ఆదివారం సాయంత్రం కలిశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శేరిలింగంపల్లికి వచ్చిన ఆయన ఈ విద్యార్థిని కలిసిన ఫొటోను ట్వీట్ చేయడం విశేషం. ఈ యువ ఇన్నోవేటర్ 9 భారతీయ భాషల్లో ఏఐ అప్లికేషన్లను అభివృద్ధి చేశాడు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన 1200 పైగా ప్రభుత్వ పథకాల సమాచారాన్ని ఈ యాప్ ద్వారా తెలుగు, తమిళం, మలయాళంతోపాటు 9 స్థానిక భాషలలో రూపొందించారు. సబ్‌కా వికాస్ యాప్ వినియోగదారులను ముఖ్యంగా మహిళలు మాతృభాషలో కమ్యూనికేట్ చేయడానికి అనుమతిస్తుంది. ముఖ్యంగా యాప్ వాయిస్ టెక్నాలజీ ద్వారా యూజర్ యొక్క స్థానిక భాషలో ప్రతిస్పందిస్తుంది. కాగా ఢిల్లీకి రావాలని ఆయన విద్యార్థికి సూచించారు.

కుటుంబ వ్యాపారాల్లో మహిళల పాత్ర పెరగాలి



ఐఎస్‌బీ రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

రాయదుర్గం: కుటుంబ వ్యాపారాలలో మహిళలకు సాధికారత చేకూరుతుందని గచ్చిబౌలిలోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్(ఐఎస్‌బీ) రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు అభిప్రాయ పడ్డారు. లింగ భేదం లేకుండా కుటుంబాలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని వారు పేర్కొన్నారు. ఫ్యామిలీ ఎంటర్‌ప్రైజ్ కోసం ఐఎస్‌బీలోని థామస్ ష్మిడేనీ సెంటర్ ఆధ్వర్యంలో కుటుంబవ్యాపారంలో మహిళలు అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఐఎస్‌బీ డీన్ ప్రొఫెసర్ మదన్ పిల్లుట్ల స్వాగత ఉపన్యాసం చేశారు. ప్రముఖ కుటుంబ వ్యాపార నాయకులు, నిపుణులు ప్రతిమా కిర్లోస్కర్, వనితా దాట్ల, శ్రీవిద్యారెడ్డి, రిషబ్‌ష్రాఫ్, ఆర్తీగుప్తా, ప్రీతిరాతి గుప్తా, సుజాతాసిసిలియా, కపిల్ రామచంద్రన్, సొగతరే, నూపుర్‌పవన్ పాల్గొని తమ అభిప్రాయాలను తెలిపారు. కుటుంబ వ్యాపారాలలో మహిళా నాయకత్వం ఎదగాల్సిన అవసరం ఉందన్నారు. ప్రపంచవ్యాప్తంగా, భారతదేశంలో ఇప్పటికే వివిధ రంగాలలో పురోగతి చెందుతోందని గుర్తు చేశారు.